మీ సమస్యను
మీడియాకు చెప్పాలని ఉందా?
M.V.S.G.TILAK M.Sc., B.Ed.
Uttarandra Regional Bureau Chief
MANAM daily paper AP & TG
journalist.tilak03@gmail.com
Whatsapp : 9494524365
Please send ur news items,
we will publish it on our platform.
manamepaper.com
సంప్రదించండి




# మనం
జనం కోసం అక్షర యజ్ఞం...

## ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలు

బుధవారం | 23 | సెప్టెంబర్ 2026 | పేజీలు : 08


# మహా విశాఖ నగరంలో రూ.3,892 కోట్ల తో 16 ప్రాజెక్టుల శంకుస్థాపన

- ఇచ్చిన గడువు లోగా పనులు పూర్తికావాలి
- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి. పి.నారాయణ



**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** మహా విశాఖ నగరానికి మహర్దశ పట్టిందని, అనేక అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేసుకొని ఏడాదిన్నర లోపలే పూర్తి చెయ్యాలని లక్ష్యంగా నిర్ణయించడం జరిగిందని తెలిపారు. మంగళవారం కుప్పం నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు 26 జిల్లాల్లో 123 మున్సి పాలిటీలలో 11,360 కోట్ల అభివృద్ధి పనులకు వర్చువల్ గా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమం పి. ఎం.పాలెం వద్దనున్న వి.కన్వెన్షన్ సెంటర్ నందు ప్రత్యక్ష ప్రత్యక్ష ప్రసారాన్ని మంత్రి నారాయణ, శాసన సభ్యులు, జిల్లా కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్ తదితరులు వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ మహా విశాఖ నగరంలో పలు మౌలిక సదుపాయాల కోసం జీవీఎంసీ ద్వారా రూ. 3531.47





2వ పేజీలో

# నేడు విద్యాసంస్థలకు సెలవు..!

## భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్ నిర్ణయం



**ఆనందపురం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** బంగాళాఖాతంలో ఏర్పడిన వాయు గుండం ప్రభావంతో విశాఖ జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని జిల్లా యంత్రాంగం కీలక నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు బుధవారం (23వ తేదీ) సెలవు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ ఆదేశాలు జారీ చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్. ప్రేమ్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాయు గుండం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. రానున్న గంటల్లోనూ వర్షాలు కొనసాగే అవకాశం ఉన్న

2వ పేజీలో

# దేశ భద్రతకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన న్యాయం కీలకం

- ప్రత్యేక కోర్టు ప్రారంభోత్సవంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్
- విశాఖపట్టణం కేంద్రంగా ఎన్ఐఏ కోర్టు.. తొలి జడ్జిగా డి. శేషయ్య నియామకం
- పాల్గొన్న జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ సన్నీ యాదవ్



2వ పేజీలో

**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** ఎన్ఐఏ(నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ–జాతీయ దర్యాప్తు సంస్థ) చట్టం పరిధిలో నమోదయ్యే కేసులను సత్వరంగా పరిష్కరించేందుకు విశాఖపట్నంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక న్యాయస్థానం కీలకంగా పనిచేస్తుందని హైకోర్టు న్యాయమూర్తి, విశాఖపట్టణం జిల్లా కోర్టు పరిపాలనా న్యాయమూర్తి జస్టిస్ బట్టు దేవానంద్ పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ కాంప్లెక్స్‌

# మహా విశాఖ నగరంలో రూ.3,892 కోట్ల తో 16ప్రాజెక్టుల శంకుస్థాపన

**ఒకటి తరువాయి** కోట్లు, వీ ఎం ఆర్ డి ఏ ద్వార రూ.360.49 కోట్ల పనులకు శంకుస్థాపనలు జరిగాయన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో పలు ప్రాజెక్టులు నిలిచిపోయాయనీ , ఈ ప్రభుత్వం వచ్చాక నిలిచిపోయిన పనులను సమీక్షించుకుని కేంద్రం సహాయం కోరడం జరిగిందని, కేంద్ర సహకారం తో పనులను తిరిగి చేపట్టడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు రూ.50 వేల కోట్ల మున్సిపల్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగానే ఒక్క రోజే రూ. .11,369 కోట్ల పనులకు శంకుస్థాపనలు చేయడం జరిగిందను, ఇందులో తాగునీరు, డ్రైనేజీ, రహదారి పనులు ఉన్నాయని, ఇది ఒక చారిత్రాత్మకమని పేర్కొన్నారు. సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్, ఇళ్ల నిర్మాణంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. టిడ్కో ఇళ్లలో గతంలో నిలిచిపోయిన 2.21 లక్షల ఇళ్లపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. టిడ్కో ఇళ్ల పూర్తి కోసం రూ.4,500 కోట్లు అవసరమైతే ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు.డిసెంబర్ నాటికి 95 శాతం టిడ్కో ఇళ్ల పనులు పూర్తి చేసే లక్ష్యం తో పని చేస్తున్నామన్నారు. టిడ్కో కాలనీల్లో స్కూళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆసుపత్రుల వంటి మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసు కుంటున్నామన్నారు. విశాఖ ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ విశాఖలో అనేక భారీ ప్రాజెక్టుల పనులు కొనసాగుతున్నాయని అన్నారు. తాగునీటి ప్రాజెక్టులు పెద్ద సంఖ్యలో వస్తున్న నేపథ్యంలో పైప్‌లైన్ వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. అపార్ట్‌మెంట్ కాంప్లెక్స్‌లకు నేరుగా నీటి సరఫరా చేసే విధంగా ప్రణాళిక రచిస్తున్నామని అన్నారు. విశాఖలో ఫుడ్ స్టాల్స్‌కు ప్రత్యేక ప్రాంతాలు ఏర్పాటు చేయాలని , ఫుడ్ వెండర్లు ఫుట్‌పాత్‌లను ఆక్రమించకుండా ప్రత్యేక స్థలాలు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలు నడిచేందుకు నిర్మించిన ఫుట్‌పాత్‌లను వ్యాపారాలకు వినియోగించవద్దని, కొత్తగా నిర్మిస్తున్న రెండు, మూడు లేన్ల రోడ్లను ఆక్రమణలకు గురికాకుండా కాపాడాలన్నారు. రోడ్లు, ఫుట్‌పాత్‌ల నిర్వహణలో స్థానిక నాయకులు చొరవ చూపాలని సూచించారు. అభివృద్ధి ప్రాజెక్టుల వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను ప్రజలకు వివరించాలనీ, అభివృద్ధి పనులు ప్రజలకు ప్రత్యక్షంగా ఉపయోగపడేలా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు.

**గ్లోబల్ సిటీ గా విశాఖ: జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్:**

జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ మాట్లాడుతూ విశాఖ నగరంలో అన్ని ప్రాంతాల్లో రహదార్ల కోసం, ట్రాఫిక్ నిర్వహణ, డ్రైనేజీ లు, వీధి లైట్లు తదితర సౌకర్యాలను గుర్తించి అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ఈ పనుల కోసం ఎక్కడెక్కడ నిధులను రాబట్టడానికి అవకాశం ఉందో అక్కడ నుండి సేకరించడం జరుగుతుందన్నారు. భవిష్యత్తు లో అనేక మెగా ప్రాజెక్టులు రాబోతున్నాయని,ఇప్పటికే కోస్టల్ కారిడార్ గ్రౌండ్ అయ్యిందని అలాగే వి.ఈ.ఆర్ లో అనేక ప్రాజెక్టులను కూడా గ్రౌండ్ చేయడం జరుగుతుందని తెలిపారు. భూగర్భ మురుగునీటి వ్యవస్థను మెరుగుపరచడం, మంచినీటి సరఫరాను, పార్కులను, రోడ్డు లను, ఏ ఐ ఆటోమేషన్ వ్యవస్థను అభివృద్ధి చేయడం ద్వారా విశాఖ నగరం గ్లోబల్ సిటీ గా, డెస్టినేషన్ సిటీ గా రూపొందుతుందని తెలిపారు.

**జీవీఎంసీ పరిధి లో మౌలిక వసతుల అభివృద్ధి:: కమిషనర్ కొత్త గార్గ్**

జీవీఎంసీ కమిషనర్ కేతన గార్గ్ మాట్లాడుతూ రాష్ట్రం లో సగం ప్రాజెక్టులు విశాఖ లోనే రావడం ఆనందంగా ఉందని అన్నారు. జీవీఎంసీ, విఎంఆర్‌డిఏ ల ద్వారా నీటి సరఫరా, డ్రైనేజీ, పార్కులు, రోడ్లు, సెంటర్ లైటింగ్ తదితర అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం లో శాసన సభ్యులు గంటా శ్రీనివాస రావు మాట్లాడుతూ భీమిలి , పెందుర్తి, అనకాపల్లి తదితర ప్రాంతాలు విస్తరిస్తున్నాయి అని ఇప్పటి నుండే ప్రణాళిక ప్రకారం పని చేయాలన్నారు.విశాఖ తూర్పు ఎం.ఎల్. ఏ వెలగపూడి రామకృష్ణ బాబు మాట్లాడుతూ తూర్పు నియోజక వర్గం నుండి మధురవాడ వరకు 725 కోట్లతో భారీ వాటర్ ప్రాజెక్టు చేపడుతున్నట్లు తెలిపారు. మ రిజర్వాయర్ ను విస్తరించాలని మంత్రిని కోరారు. గాజువాక ఎం ఎల్ ఏ పల్లా శ్రీనివాస్ రావు మాట్లాడుతూ గత 2 సంవత్సరాల లో గాజువాకలో 30 కోట్లతో అభివృధి పనులు చేపట్టామని ,నియోజక వర్గంలో పార్టీలు క్రీడా మైదానాల ఏర్పాటు పై దృష్టి పెట్టాలన్నారు.పశ్చిమ నియోజకవర్గం ఎం ఎల్ ఏ గణబాబు మాట్లాడుతూ నగరం అభివృద్ధి చెందితే ఆర్థికాభివృది సాధ్య మవుతుందన్నారు.ఉత్తర నియోజక వర్గ ఎం ఎల్ ఏ విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ టిడ్కో ఇల్లు పెద్ద ఎత్తున మంజూరు చేయాలని మంత్రి నీ కోరారు.మార్క్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, సురేంద్ర జీవీఎంసీ అదనపు కమిషనర్లు , జోనల్ కమిషనర్లు, వి.ఎం. ఆర్.డి. ఏ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

# తీర ప్రాంతాన్ని సందర్శించిన ఎమ్మెల్యే



**లావేరు , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** తుఫాను కారణంగా తీర ప్రాంతంలో ఉన్న గ్రామాలను అప్రమత్తం చేసేందుకు స్థానిక ఎచ్చెర్ల శాసనసభ్యులు నడికుదిటి ఈశ్వరరావు సుడిగాలి పర్యటన చేశారు ఈ సందర్భంగా ఆయన అల్లివలస జీరుపాలెం తీర ప్రాంతాలను సందర్శించారు రెవెన్యూ సిబ్బంది పోలీస్ యంత్రాంగం విపత్తు నిర్వహణ సిబ్బంది ప్రతిక్షణం అందుబాటులో ఉండి తుఫాను ఉధృత అయినప్పుడు వారికి సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు అదేవిధంగా మత్స్యకారులను చేపల వేటకు వెళ్ళొద్దని సూచించారు ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు సర్పంచ్ బాలి శ్రీనివాసరావు తదితర కార్యకర్తలు పాల్గొన్నారు

# దేశ భద్రతకు సంబంధించిన కేసుల్లో వేగవంతమైన న్యాయం కీలకం

**ఒకటి తరువాయి** నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్ఐఏ ప్రత్యేక న్యాయస్థానాన్ని మంగళవారం ఆయన వర్చ్యువల్ గా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన దేశ భద్రత, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ఎన్ఐఏ కేసులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకుండా చట్టపరమైన ప్రక్రియను అనుసరిస్తూ త్వరితగతిన విచారణ పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నేరం చేసిన వారికి చట్టప్రకారం శిక్ష పడటంతో పాటు, నిర్దోషులకు ఎలాంటి అన్యాయం జరగకుండా విముక్తి లభించేలా న్యాయ ప్రక్రియ సాగాలని పేర్కొన్నారు. గతంలో ఎన్ఐఏ చట్టం పరిధిలోని కేసుల విచారణకు విశాఖపట్నం, విజయవాడలో రెండు నిర్దేశిత న్యాయస్థానాలు ఉండేవని తెలిపారు. గౌరవ సుప్రీంకోర్టు ఆదేశాలు, భారత ప్రభుత్వ విధాన నిర్ణయం మేరకు ప్రతి రాష్ట్రంలో ఎన్ఐఏ కేసుల విచారణ కోసం ప్రత్యేక న్యాయస్థానాలను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. ఆంధ్రప్రదేశ్‌కు మంజూరైన ప్రత్యేక కోర్టును విశాఖపట్నంలో ఏర్పాటు చేయడం ప్రాధాన్యమైన విషయమన్నారు. ఈ ప్రత్యేక న్యాయస్థానం ద్వారా ఎన్ఐఏ కేసుల విచారణ మరింత వేగవంతంగా, సమర్థవంతంగా సాగి, బాధితులకు సకాలంలో న్యాయం అందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నూతనంగా ఏర్పాటైన ప్రత్యేక న్యాయస్థానానికి తొలి ప్రిసైడింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్న న్యాయమూర్తి డి. శేషయ్యను అభినందించారు.

**విశాఖ కీర్తి కిరీటంలో మరో కలికితురాయి: పీడీజే జి. శ్రీనివాస్**


ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్ఐఏ కేసుల విచారణకు ఏకైక ప్రత్యేక న్యాయస్థానం విశాఖపట్నంలో ఏర్పాటు కావడం నగరానికి ఎంతో గర్వకారణమని జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి జి. శ్రీనివాస్ పేర్కొన్నారు. ఇది విశాఖపట్నం కీర్తి కిరీటంలో మరో కలికితురాయి వంటిదని అభివర్ణించారు. ఎన్ఐఏ చట్టం పరిధిలోని కేసులు దేశ భద్రత, ప్రజా ప్రయోజనాలకు సంబంధించిన ప్రాధాన్యమైనవని, వాటిని సత్వరంగా పరిష్కరించేందుకు ప్రత్యేక కోర్టు దోహదపడుతుందన్నారు. ప్రత్యేక న్యాయస్థానం ఏర్పాటుకు సహకరించిన హైకోర్టు పెద్దలకు, జిల్లా కోర్టులోని సహచరులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎన్ఐఏ కోర్టు తొలి న్యాయమూర్తి(ఎఫ్.ఎ.సి.)గా బాధ్యతలు స్వీకరించిన ప్రస్తుతం ఏసీబీ కోర్టు న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న డి. శేషయ్యకు, జిల్లా జడ్జి జి. శ్రీనివాస్, ఇతర న్యాయమూర్తులు శుభాకాంక్షలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవి చీమలపాటి (వర్చ్యువల్), హైకోర్టు రిజిస్ట్రార్ (అడ్మినిస్ట్రేషన్) చిన్నంశెట్టి రాజు (వర్చ్యువల్), బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సన్నీ యాదవ్, పలువురు న్యాయాధికారులు, బార్ అసోసియేషన్ కార్యనిర్వాహక సభ్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# నేడు విద్యాసంస్థలకు సెలవు..!

**ఒకటి తరువాయి** నేపథ్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల సిబ్బంది ఇబ్బందులకు గురికాకుండా ముందస్తు చర్యల్లో భాగంగా సెలవు ప్రకటించినట్లు అధికారులు తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు సహా జిల్లాలోని విద్యాసంస్థలకు బుధవారం సెలవు వర్తిస్తుందని స్పష్టం చేశారు. విద్యార్థుల రాకపోకలకు వర్షాలు, రహదారులపై నీటి ప్రవాహం ఇబ్బందికరంగా మారే అవకాశం ఉన్నందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. వర్షాల పరిస్థితిని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తోందని అధికారులు తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికార యంత్రాంగం సూచనలను పాటించాలని సూచించారు. వాతావరణ పరిస్థితులను బట్టి తదుపరి నిర్ణయాలు తీసుకుంటామని వెల్లడించారు.

# యాతపేట లో అన్నసమారాధనకు ముఖ్య అతిథిగా కిలపర్తి రాజేశ్వర్ భాస్కర్ రావు

**దేవరాపల్లి , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** మండలంలో గల యాతపేట లో జరుగుతున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిలపర్తి రాజేశ్వర్ భాస్కర్ రావు హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు .స్థానిక దడ బాయ్స్ మరియు షేక్ బాయ్స్ యువకుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో వినాయకునికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం, కిలపర్తి రాజేశ్వర్ భాస్కర్ రావు స్వామివారిని దర్శిం చుకుని అన్నసమారాధనను ప్రారంభించారు. భక్తులకు స్వయంగా అన్నప్రసాదం వడ్డించి అందరితో కలిసి పోయారు.ఈ సందర్భంగా యాతపేట పెద్దలు, యువకులు కిలపర్తి రాజేశ్వరి భాస్కర్ రావు ని ఘనంగా సన్మానించారు.



అనంతరం ఆయన మాట్లాడుతూ – యువత ఇలాంటి భక్తి, సేవా కార్యక్రమాలు చేయడం చాలా గొప్పవిషయం.గణపతి ఆశీస్సులతో యాతపేట గ్రామం, దేవరాపల్లి మండలం సుభిక్షంగా ఉండాలని కోరుకుంటున్నాను అని అన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# గురువులపై దాడి..గొడ్డలి పార్టీ దుర్మార్గానికి పరాకాష్ఠ



- పాఠాలు చెప్పే ఉపాధ్యాయుల పై చేయిచేసుకోవడం హేయం.. బాధ్యులను ఉపేక్షించేది లేదు
- డీఎస్సీపై దుష్ప్రచారంతో అభ్యర్థుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసే కుట్ర
- చంద్రబాబు పాలనలో యువతకు ఉద్యోగ భరోసా.. లోకేశ్ చొరవతో విద్యారంగంలో సంస్కరణలు
- పల్లా శ్రీనివాస రావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు మరియు గాజువాక ఎమ్మెల్యే

**అమరావతి , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పి భావితరాలను తీర్చిదిద్దే ఉపాధ్యాయులపై వైసీపీ శ్రేణులు దాడులకు పాల్పడటం అత్యంత దుర్మార్గమని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు మండిపడ్డారు. డీఎస్సీ స్పోర్ట్స్ కోటా నియామకాలపై ఆరోపణలు చేస్తూ విజయవాడలోని శాప్ కార్యాలయం వద్ద వైసీపీ చేపట్టిన ఆందోళన సందర్భంగా చోటుచేసుకున్న ఉద్రిక్తతపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఉపాధ్యాయులు అంటే గౌరవం లేని గొడ్డలి పార్టీ నేతలు.. ఉద్యోగాలు సాధించిన టీచర్లను అవమానించడమే కాకుండా దాడులకు దిగడం వారి దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమని పల్లా ధ్వజమెత్తారు. క్రీడల్లో ప్రతిభ చాటి, పతకాలు సాధించి, కష్టపడి చదివి డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఉద్యోగాలు పొందిన వారిపై అనుమానాలు రేకెత్తించడం సరికాదన్నారు. తమ వద్ద ఉన్న ధ్రువపత్రాలు, పతకాలు నిజమైనవేనని స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు వెల్లడించిన నేపథ్యంలోనూ రాజకీయ రాద్ధాంతం చేయడం దేనికని ప్రశ్నించారు.

**గురువులను గౌరవించడం మన సంస్కారం**

ఉపాధ్యాయ వృత్తి సాధారణ ఉద్యోగం కాదని పల్లా అన్నారు. ఒక ఉపాధ్యాయుడి వెనుక ఎన్నో సంవత్సరాల కఠోర శ్రమ, చదువు, పోటీ, కుటుంబం ఆశలు ఉంటాయని పేర్కొన్నారు. విద్యార్థులకు పాఠాలు చెప్పడమే కాకుండా వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దే మార్గదర్శకులుగా గురువులు నిలుస్తారని చెప్పారు. అలాంటి ఉపాధ్యాయులను రోడ్లపైకి లాగి అవమానించడం, దాడులకు పాల్పడటం వైసీపీ రాజకీయ సంస్కృతికి అద్దం పడుతోందని విమర్శించారు.

**డీఎస్సీపై బురదజల్లడమే జగన్ రెడ్డి లక్ష్యం**

డీఎస్సీ నియామకాలపై వైసీపీ చేస్తున్న ఆరోపణలు ఇప్పటికే రాజకీయ రాద్ధాంతంగా మారాయని పల్లా అన్నారు. జగన్ రెడ్డికి విద్యారంగంపై, ఉపాధ్యాయులపై గౌరవం లేదని విమర్శించారు. కరోనా సమయంలో ఉపాధ్యాయులను మద్యం దుకాణాల వద్ద కాపలా పెట్టిన తీరు వారి పట్ల గత ప్రభుత్వానికి ఉన్న గౌరవాన్ని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు. డీఎస్సీ ద్వారా 16 వేల ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి యువతకు ఉద్యోగ భరోసా కల్పించిన ఘనత చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వానిదని పల్లా తెలిపారు. డీఎస్సీపై ఆరోపణలు ఉంటే ఆధారాలతో సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, రాజకీయ ముసుగులో ఉపాధ్యాయులను అవమానించడం తగదని హితవు పలికారు.

**చంద్రబాబు నాయకత్వంలో విద్యారంగానికి కొత్త దిశ**

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని పల్లా అన్నారు. మంత్రి నారా లోకేశ్ నేతృత్వంలో విద్యారంగంలో పలు సంస్కరణలు చేపడుతూ, రాజకీయ జోక్యానికి తావు లేకుండా పాఠశాలలను అభివృద్ధి చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉపాధ్యాయుల సంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాల కల్పనకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గురువులపై దాడి చేసిన వారిని చట్ట ప్రకారం గుర్తించి చర్యలు తీసుకోవాలని, ఇలాంటి ఘటనలను ఉపేక్షించరాదని పల్లా స్పష్టం చేశారు. ఉపాధ్యాయులను కించపరిచే రాజకీయాలు మానుకోవాలని జగన్ రెడ్డికి హితవు పలికారు. గొడ్డలి పార్టీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా.. కూటమి ప్రభుత్వం విద్య, ఉద్యోగ రంగాల్లో చేపడుతున్న సంస్కరణలను, యువతకు కల్పిస్తున్న అవకాశాలను అడ్డుకోలేదని పల్లా తేల్చిచెప్పారు.

## 99.31 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తితో అగ్రగామిగా నిలిచిన ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్

**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 99.31 శాతం క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి సాధించింది. బహిరంగంగా అందుబాటులో ఉన్న వివరాల (ఫారం ఎల్ 39 మరియు ఎల్ 40) ప్రకారం భారత్‌లోని టాప్ జీవిత బీమా రంగ సంస్థల్లో ఇదే అత్యధికం. సదరు త్రైమాసికంలో కంపెనీ రూ. 414.08 కోట్ల విలువ చేసే ఇండివిడ్యువల్ డెత్ క్లెయిమ్‌లను పరిష్కరించింది. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో అగ్రగామి జీవిత బీమా సంస్థల్లోనే అత్యధికంగా, సగటున ఒక్కో క్లెయిమ్ విలువ సుమారు రూ. 15 లక్షల స్థాయిలో ఉండటం గమనార్హం. మా కస్టమర్లు, వారి కుటుంబాలకు క్లెయిమ్స్ ప్రక్రియ సులభతరంగా, నిరాటంకంగా, సకాలంలో పూర్తయ్యే విధంగా ఉండేలా చూసేందుకు ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ కట్టుబడి ఉంది. 2027 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో మా క్లెయిమ్ సెటిల్మెంట్ నిష్పత్తి, పరిశ్రమలోనే అత్యధిక స్థాయిలో 99.31 శాతంగా నమోదైంది. నాన్ – ఇన్వెస్టిగేటెడ్ క్లెయిమ్‌లకు సంబంధించి సగటు క్లెయిమ్ సెటిల్మెంట్ టర్నెరౌండ్ సమయమనేది, ఆఖరు డాక్యుమెంటు అందిన తేదీ నుంచి కేవలం ఒకే రోజుగా ఉంటోంది. అంతేగాకుండా మేము రూ. 414.08 కోట్ల విలువ చేసే డెత్ క్లెయిమ్‌లను సెటిల్ చేశాం. కస్టమర్ల ప్రయోజనాలకే అత్యంత ప్రాధాన్యమివ్వడం, డిజిటలైజేషన్‌పై మరింతగా దృష్టి పెట్టడం ద్వారా మేము క్లెయిమ్‌లను మరింత వేగంగా పరిష్కరించడంతో పాటు పాలసీదారుల కుటుంబాలకు అత్యంత కీలకమైన సమయంలో ఆర్థికంగా మద్దతుగా నిల్చేందుకు దోహదపడుతున్నాయి. క్లెయిమెంట్లు మా మొబైల్ యాప్, వాట్సాప్, చాట్‌బాట్ మరియు వెబ్‌సైట్ ద్వారా క్లెయిమ్‌లను సులభంగా నమోదు చేసుకోవచ్చు మరియు ట్రాక్ చేసుకోవచ్చు. క్లెయిమ్ ఫర్ ష్యూర్ కార్యక్రమం కింద అర్హత గల క్లెయిమ్‌లకు ఒక్క రోజు వ్యవధిలోనే మేము రూ. 75 కోట్లు చెల్లించాం. కీలకమైన తరుణంలో కుటుంబాలకు బాసట లభించేలా మా డిజిటల్ ప్రక్రియలను మరింతగా పటిష్టం చేసుకోవడాన్ని కొనసాగిస్తున్నాం" అని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ (అండర్‌రైటింగ్ అండ్ రిటైల్ క్లెయిమ్స్) సారంగ్ గోఖలే తెలిపారు.

## ఎల్‌జీ కొత్త సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ల శ్రేణి విడుదల




**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ కొత్త సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ల శ్రేణిని నేడు మార్కెట్లోకి విడుదల చేసింది. శక్తివంతమైన వాషింగ్ పనితీరు, మెరుగైన సౌకర్యాలు, మన్నికైన నిర్మాణం తో పాటు, ఆకట్టుకునే ప్రీమియం డిజైన్‌తో వీటిని రూపొందించింది. 8 కిలోల నుంచి 12 కిలోల సామర్థ్యంతో మొత్తం 15 మోడళ్లలో అందుబాటులోకి వచ్చిన ఈ కొత్త శ్రేణి, కుటుంబ పరిమాణం, దుస్తుల ఉతకాల్సిన అవసరాలు, డిజైన్ అభిరుచులకు అనుగుణంగా భారతీయ వినియోగదారులకు మరిన్ని ఎంపికలను అందిస్తుంది. ఏ ఎక్స్ సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ల ఎగుమతులు 2027లో ప్రారంభం కానున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా 10కిపైగా దేశాలను లక్ష్యంగా చేసుకుని ఈ ఎగుమతులను చేపట్టనున్నారు. ఈ లాంచ్‌తో ఎల్‌జీ సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్లలో కొత్త ప్రమాణాలను తీసుకొస్తోంది. డిటర్జెంట్ మరకలు, బట్టలకు అంటుకునే దుమ్ము, మొండి మరకలు, బట్టలు ఆలస్యంగా ఆరడం, సులభంగా దెబ్బతినే మూతలు వంటి రోజువారీ లాండ్రీ సమస్యలకు పరిష్కారం చూపేలా వీటిని రూపొందించింది. ఈ శ్రేణిలో ఆధునిక డిజైన్‌తో పాటు ఉపయోగకరమైన సాంకేతికతను అందించారు. దీంతో బట్టలు ఉతకడం మరింత సులభంగా, వేగంగా, సమర్థవంతంగా మారుతుంది. కొత్త సెమీ ఆటోమేటిక్ వాషింగ్ మెషీన్ శ్రేణిని రోజువారీ బట్టలు ఉతికే సమయంలో మరింత సౌకర్యం, మెరుగైన పనితీరును కోరుకునే వినియోగదారులను దృష్టిలో ఉంచుకుని రూపొందించాము. ఎల్‌జీకి ఉన్న నమ్మకమైన టెక్నాలజీ, మన్నికైన నిర్మాణం, ప్రీమియం డిజైన్‌తో పాటు, ఇళ్లలో ఎదురయ్యే రోజువారీ సమస్యలకు పరిష్కారం చూపే స్మార్ట్ ఫీచర్లను ఈ శ్రేణిలో అందించాము," అని ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ హోమ్ అప్లయెన్సెస్ సొల్యూషన్ సేల్స్ డివిజన్ లీడర్ యంగ్ మిన్ హ్వాంగ్ తెలిపారు.

## విశాఖ జూలో 4ఆసియా సింహం పిల్లల జననం



**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** ఇందిరా గాంధీ జంతు ప్రదర్శనశాలలో పరిరక్షణ సంతానోత్పత్తి కార్యక్రమంలో భాగంగా నాలుగు ఆసియా సింహం పిల్లలు జన్మించాయి.నెల రోజుల క్రితం పుట్టిన ఈ పిల్లలను తల్లి సింహం సంరక్షణలోనే ఉంచి, నిపుణులైన అధికారులు వాటి ఆరోగ్యాన్ని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు. అంతరించిపోతున్న అత్యంత అరుదైన ఆసియా సింహాల జాతిని కాపాడుకోవడంలో ఈ జననం ఒక కీలక విజయమని జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు. జూ సిబ్బంది శాస్త్రీయ నిర్వహణ,నిరంతర సంరక్షణ వల్లే ఇది సాధ్యమైందని ఆమె పేర్కొన్నారు.

# మహిళల నాయకత్వంతోనే గ్రామాల అభివృద్ధి

- సాఫీడ్ సంస్థ చింతూరు కోఆర్డినేటర్ ఎస్.కె అహ్మద్ అలీ
- చింతూరులో మహిళా నాయకత్వ అభివృద్ధి వర్క్‌షాప్ నిర్వహణ
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న చింతూరు సి.ఐ గోపాలకృష్ణ ఎస్.బి.ఐ మేనేజర్ సాయిచంద్

**చింతూరు , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** మహిళలు అన్ని రంగాల్లో ముందుకు వచ్చి తమ హక్కులు, సమస్యలపై అవగాహన పెంచుకుని నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని పలువురు అధికారులు సూచించారు. చింతూరు మండలంలోని చింతూరు గ్రామంలో సాఫీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సోమవారం మహిళా నాయకత్వ అభివృద్ధి వర్క్‌షాప్ నిర్వహించారు. సాఫీడ్ స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ ఎస్.కె. అహ్మద్ అలీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 8 గ్రామాల నుంచి సుమారు 125 మంది మహిళలు పాల్గొన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో మహిళలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అభివృద్ధిలో వెనుకబడిన ప్రాంతాల్లో మహిళలను చైతన్యపరిచి ముందుకు తీసుకెళ్లాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా



మహిళల ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వావలంబన, ప్రభుత్వ పథకాలు, మహిళల భద్రత తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మహిళలు తమ సమస్యలను ధైర్యంగా అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కారాల కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో చింతూరు సీఐ గోపాలకృష్ణ, ఎస్సై సంతోష్ కుమార్, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, ఎస్బీఐ బ్యాంక్ మేనేజర్ సాయి చందు, ప్రభుత్వ గైనకాలజిస్ట్ డాక్టర్ శశికళ పాల్గొని మహిళలకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. సంస్థ నిర్వాహకులు బంగారు జానకి, సోడి లక్ష్మి, తురం నాగరాజు, అంజలి, కీర్తి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.



# యూజీసీ పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలి

- జోరు వాన లో కెజీహెచ్ ఎదుట డిఎంఈ ప్రభుత్వ వైద్యుల ధర్నా
- బకాయిలు చెల్లించేవరకు పోరాటం ఆపేదిలేదు
- ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ.బాబ్జి శ్యామ్ కుమార్




**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** ప్రభుత్వ వైద్య కళాశాల లో డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డిఎంఈ )పరిధిలో పని చేసే ప్రభుత్వ వైద్యులకు రావలసిన 2016 యూజీసీ పీఆర్సీ జీతభత్య బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చెయ్యాలని ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఐ. బాబ్జి శ్యామ్ కుమార్ డిమాండ్ చేశారు.ఈ విషయమై గత నెల రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య కళాశాల లో జరుగుతున్న నిరసన,ధర్నా ల కొనసాగింపులో భాగంగా మంగళవారం ఏపీ ప్రభుత్వవైద్యులసంఘం, ఆంధ్ర వైద్య కళాశాల విభాగం ఆధ్వర్యంలో విశాఖ లో వైద్యులు నిరసన నిర్వహించారు.జోరున వర్షం కురుస్తున్న వర్షంలో కూడా వైద్యులు తమ దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం కింగ్ జార్జి ఆసుపత్రి సూపరింటెండెంట్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. యూజీసీ బకాయిలు చెల్లించేవరకు పోరాటం ఆపేదే లేదు అంటూ వానలో నినాదాలు చేస్తూ ఏపీ ప్రభుత్వ వైద్యులు సంఘం నేతలు ప్రభుత్వంను హెచ్చరించారు. ఈ సందర్భంగా ధర్నా ను ఉద్దేశించి ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఐ. బాబ్జీ శ్యామ్ కుమార్ మాట్లాడుతూ, బకాయిల చెల్లింపు విషయంమై 2022 నుంచి అధికారులు, ఆరోగ్య శాఖ మంత్రికి 30కి పైగా వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకపోయిందన్నారు. పైగా బకాయిలు ఇవ్వడం వీలుపడదని అధికారులు మెమో ఇవ్వడాన్ని నిరసిస్తూ ఆగస్టు 21 నుంచి నల్ల బ్యాడ్జీలతో, సెప్టెంబర్ 1 నుంచి ప్రతిరోజూ రాష్ట వ్యాప్తంగా అన్ని వైద్య కళాశాల లో అరగంట పాటు ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని డిగ్రీ కాలేజీ, యూనివర్సిటీ, పాలిటెక్నిక్, వెటర్నరీ కళాశాల అధ్యాపకులతో పాటు తెలంగాణ సహా ఇతర రాష్ట్రాల్లో కూడా యూజీసీ బకాయిలు చెల్లించారని తెలిపారు. దేశంలోనే ఏపీని వైద్య సేవల్లో అగ్రస్థానంలో నిలిపిన తమ పట్ల అధికారులు చిన్నచూపు చూడటం దారుణమని డాక్టర్ బాబ్జి శ్యామ్ కుమార్ అన్నారు. ఈ ధర్నా కార్యక్రమం లో ఆంధ్ర వైద్య కళాశాల ఆర్థో పీడిక్స్ విభాగం అధిపతి డాక్టర్ భవాని ప్రసాద్, పెడియాట్రిక్స్ విభాగం అధిపతి డాక్టర్ బీఎస్ చక్రవర్తి ఆర్ఎంఓ బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

## గిడిజాలపై కన్నేసిన భూ" రాబందులు"







**ఆనందపురం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** ఆనందపురం మండలం గిడిజాల పంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 258లో ప్రభుత్వ భూముల వ్యవహారంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వానికి చెందిన భూముల్లో ఆక్రమణలు జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. సర్వే నంబర్ 258లో ఎంత మేర ప్రభుత్వ భూమి ఉంది? ప్రస్తుతం ఆ భూమి ఎవరి ఆధీనంలో ఉంది? భూమికి సంబంధించిన రికార్డుల్లో ఏమైనా మార్పులు జరిగాయా? అనే అంశాలపై అధికారులు స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉందని స్థానికులు చెబుతున్నారు. భూములపై లావాదేవీలు జరిగినట్లయితే వాటికి సంబంధించిన పత్రాలు, అనుమతులను కూడా పరిశీలించాలని కోరుతున్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో భాగంగా రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, రికార్డులను పరిశీలించాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఆక్రమణలు లేదా నిబంధనలకు విరుద్ధంగా లావాదేవీలు జరిగినట్లు విచారణలో తేలితే బాధ్యులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారంపై ఇప్పటివరకు అధికారికంగా పూర్తి వివరాలు వెల్లడికాలేదు. సర్వే నంబర్ 258కు సంబంధించిన భూములపై విచారణ చేపట్టి వాస్తవాలను ప్రజలకు వెల్లడిస్తే అనుమానాలకు తెరపడుతుందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉంటే ప్రాథమిక స్థాయిలో విచారణ జరిపి ఉన్నతాధికారులకు నివేదిక అందించా ల్సిన వీఆర్వో కొంతమంది వ్యక్తులతో చేతులు కలిపి భారీ ఎత్తున డబ్బులు వసూలు చేస్తున్నట్లు సమాచారం. వీఆర్వోలు చేస్తున్న తప్పులు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారుతుంది. విఆర్వోలతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసి వారిని సక్రమ బాటలో నడిపించాల్సిన బాధ్యత అధికారులకు ఉందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

# విశాఖ అభివృద్ధికి రూ.3,963 కోట్లతో పనులు



- చంద్రబాబు నాయకత్వంలో నగర మౌలిక వసతులకు భారీ ఊతం
- నారాయణ మార్గదర్శకత్వంలో అభివృద్ధి పనులకు వేగం
- ప్రపంచస్థాయి మౌలిక వసతులతో విశాఖ ఆర్థిక రాజధానికి మరింత ఊతం
- విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- పల్లా శ్రీనివాస రావు, టిడిపి రాష్ట్ర అధ్యక్షుడు మరియు గాజువాక ఎమ్మెల్యే




**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** విశాఖ నగర అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా నిర్వహించిన శంకుస్థాపన మహోత్సవంలో భాగంగా విశాఖలో జరిగిన కార్యక్రమంలో పల్లా మాట్లాడారు. జీవీఎంసీ, వీఎంఆర్డీఏ పరిధిలో మొత్తం రూ.3,963.26 కోట్ల విలువైన మౌలిక వసతుల పనులు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విశాఖ నగర అభివృద్ధి, మౌలిక వసతులపై నిర్లక్ష్యం వహించారని పల్లా విమర్శించారు. జగన్ రెడ్డి పాలనలో అభివృద్ధి పనులకు ప్రాధాన్యత తగ్గిందని, నగర విస్తరణకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తాగునీరు, డ్రెయిన్లు, రహదారులు, పారిశుద్ధ్యం వంటి ప్రాథమిక వసతులపై గత పాలకులు తగిన శ్రద్ధ చూపలేదన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిలిచిపోయిన పనులకు కదలిక వచ్చిందని తెలిపారు. ప్రస్తుతం రూ.3,072.73 కోట్ల విలువైన పనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని పల్లా వివరించారు. అమృత్-2.0 కింద తాగునీటి సరఫరా పనులకు రూ.833.69 కోట్లు, ఐఎఫ్‌సీ-యూసీఎఫ్ తొలి దశ కింద తాగునీరు, డ్రెయిన్ల అభివృద్ధికి రూ.1,501.03 కోట్లు, ఎస్‌బీఎం-2.0 కింద ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణకు రూ.213.38 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్ నిర్మాణానికి రూ.172 కోట్లు, జీవీఎంసీ మురుగునీటి పారుదల ప్యాకేజీ-2కు రూ.150 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 'సారథి' ప్రాజెక్టులో 101 జంక్షన్లలో కృత్రిమ మేధ ఆధారిత సమగ్ర రవాణా నిర్వహణ వ్యవస్థకు రూ.99.19 కోట్లు, సిటీ ఆపరేషన్ సెంటర్ కృత్రిమ మేధ ఆధునికీకరణకు రూ.65 కోట్లు కేటాయించినట్లు వెల్లడించారు. మురికివాడల రహిత నగరం కోసం రూ.28.44 కోట్లు, స్మార్ట్ వెండింగ్ జోన్లకు రూ.10 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. మరో రూ.890.53 కోట్ల విలువైన పనులు టెండర్లు, పరిపాలనా అనుమతుల దశలో ఉన్నాయని పల్లా తెలిపారు. జీవీఎంసీ పరిధిలో రహదారులు, డ్రెయిన్లు, పూడికతీత, పార్కుల అభివృద్ధికి రూ.332.53 కోట్లు, వీఎంఆర్డీఏ పరిధిలో ఇదే తరహా పనులకు రూ.160 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. తీర ప్రాంత పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. తీరప్రాంత కోత నివారణకు జీవీఎంసీ పరిధిలో రూ.222 కోట్లు, వీఎంఆర్డీఏ పరిధిలో రూ.176 కోట్ల విలువైన పనులకు పరిపాలనా అనుమతులు లభిస్తున్నాయని పల్లా వెల్లడించారు.

## చంద్రబాబు దార్శనికత.. నారాయణ మార్గదర్శకత్వంలో విశాఖకు కొత్త రూపు

చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధికి స్పష్టమైన కార్యాచరణతో ముందుకు సాగుతోందని పల్లా అన్నారు. పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ మార్గదర్శకత్వంలో విశాఖ అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికతో పనులు చేపడుతున్నామని, నగర మౌలిక వసతుల బలోపేతంపై మంత్రి నారాయణ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని తెలిపారు. శాఖాపరమైన సమన్వయంతో పనులను వేగవంతం చేస్తూ, నగర ప్రజలకు అవసరమైన మౌలిక వసతులను అందుబాటులోకి తీసుకురావడంలో మంత్రి నారాయణ చొరవ అభినందనీయమని పల్లా పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర పథకాలతో పాటు ఏఐఐబీ, ఐఎఫ్‌సీ, హడ్కో, ప్రభుత్వ బ్యాంకుల రుణాలు, ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో నిధులు సమీకరించి ప్రాజెక్టులను అమలు చేస్తున్నామని చెప్పారు. గత పాలకుల హయాంలో ఏర్పడిన మౌలిక వసతుల లోటుపాట్లను సరిదిద్దుతూ విశాఖకు ఆధునిక వసతులు కల్పిస్తున్నామని పల్లా తెలిపారు. కేటాయించిన పనులను నాణ్యతతో, నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

## ప్రపంచస్థాయి మౌలిక వసతులతో ఆర్థిక రాజధానికి ఊతం

విశాఖలో ప్రపంచస్థాయి మౌలిక వసతులు అందుబాటులోకి వస్తే నగరం ఆర్థిక రాజధానిగా మరింత వేగంగా అభివృద్ధి చెందడానికి, పెట్టుబడులు, పరిశ్రమలు, ఐటీ సంస్థలు, ఉపాధి అవకాశాలకు మరింత ఊతం లభిస్తుందని పల్లా అన్నారు. రహదారులు, తాగునీరు, డ్రెయినేజీ, ట్రాఫిక్ నిర్వహణ, పారిశుద్ధ్యం, స్మార్ట్ సిటీ వసతులు వంటి రంగాల్లో భారీగా పెట్టుబడులు పెట్టడం ద్వారా విశాఖ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. విశాఖలో గూగుల్ వంటి అంతర్జాతీయ సంస్థల పెట్టుబడులపై గొడ్డలిపార్టీ చేస్తున్న ప్రతికూల ప్రచారానికి నగరంలో జరుగుతున్న అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనే సమాధానమని పల్లా అన్నారు. ప్రపంచస్థాయి సంస్థలు, పెట్టుబడులను ఆకర్షించే సామర్థ్యం విశాఖకు ఉందని, ఆ అవకాశాలను సద్వినియోగం చేసుకునేలా కూటమి ప్రభుత్వం మౌలిక వసతులను బలోపేతం చేస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, మంత్రి నారాయణ చొరవతో విశాఖ అభివృద్ధి మరింత వేగం పుంజుకుంటుందని, నగరాన్ని ప్రపంచస్థాయి మౌలిక వసతులు కలిగిన ఆర్థిక కేంద్రంగా తీర్చిదిద్దడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పల్లా స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# కరువు పరిస్థితులపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలి : సీపీఎం చింతూరు మండల కమిటీ డిమాండ్



**చింతూరు , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** వర్షపాతం లోటుతో చింతూరు మండలంలో కరువు పరిస్థితులు ఏర్పడుతున్నందున ప్రభుత్వం వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని సీపీఎం మండల కమిటీ డిమాండ్ చేసింది. మంగళవారం చింతూరులో జరిగిన సమావేశంలో మండల కార్యదర్శి పల్లపు వెంకట్ మాట్లాడుతూ వర్షాలు లేక వ్యవసాయం, తాగునీరు, పశువుల మేతపై ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉందన్నారు. మండలాన్ని కరువు ప్రభావిత ప్రాంతంగా గుర్తించి రైతులకు పంట నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడీ అందించాలని కోరారు. ఉపాధి హామీ పనులు పెంచి గ్రామీణ ప్రజలకు పనులు కల్పించాలని, గిరిజన రైతులకు ప్రత్యేక కరువు సహాయక ప్యాకేజీ ప్రకటించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సీసం సురేష్, మల్లం సుబ్బమ్మ, పోడియం లక్ష్మణ్, ముట్టుం రాజయ్య, వేక రాజ్‌కుమార్, చింతా రాంబాబు, మడకం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# వాయుగుండం, భారీ వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- అధికారులు పనిచేసే ప్రదేశాలలోనే ఉండాలి**
**- సెలవులు మంజూరు చేయ బడవు**
**- అధికారులతో వీసీ నిర్వహించిన జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్**



**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** బంగాళాఖాతంలో వాయుగుండం ప్రభావం వల్ల రానున్న మూడు రోజులూ భారీ వర్షాల కురవనున్నాయని, ఈ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. మంగళవారం సాయంత్రం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, జేసీ విద్యాధరిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులతో సమీక్ష నిర్వహించి, ముందస్తు చర్యలపై పలు సూచనలు చేశారు. భారీ వర్షాల ప్రభావం ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించి అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు.ఏ విధమైన సెలవులు మంజూరు చేయ బడవన్నారు. లోతట్టు ప్రాంతాలు, కొండ వాలు ప్రాంతాల్లో పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. వర్షపు నీరు నిలిచే ప్రాంతాల్లో తక్షణమే పారుదల చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట సహాయక చర్యలు, రక్షణ బృందాలు, వాహనాలు, పరికరాలను సిద్ధంగా ఉంచాలని సూచించారు. విద్యుత్, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం తదితర సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రజలకు వర్షాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తత సూచనలు, అవసరమైన సమాచారం అందించాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలు అధికారులను సంప్రదించేలా కంట్రోల్ రూమ్ వ్యవస్థను సమర్థంగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ తో పాటు, డివిజన్, మండల స్థాయిల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి ప్రాణ,పశు, నష్టం జరగకుండా ముందస్తు చర్యలకు ప్రాధాన్యం ఇవ్వాలని, అధికారులు నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పల్లపు ప్రాంతాల్లో ఉండేవారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు వీలుగా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని చెప్పారు. డెలివరీ సమయానికి దగ్గరైన గర్భిణులను ముందుగానే ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేయాలని సూచించారు.

### కలెక్టరేట్ తో పాటు, డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు

భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా కలెక్టరేట్, ఇతర డివిజన్ కేంద్రాల్లో కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ తెలిపారు. అవన్నీ నిరంతరం పని చేస్తాయని, మూడు రోజుల పాటు ప్రజలకు సేవలందిస్తాయని పేర్కొన్నారు. సంబంధిత అధికారులకు, సిబ్బందికి డ్యూటీలు వేసినట్లు చెప్పారు. వారంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలని, మీడియా ద్వారా, సోషల్ మీడియా ద్వారా వచ్చిన సమాచారాన్ని క్రోడీకరించి సంబంధిత అధికారులకు పంపేలా చర్యలు తీసుకున్నామని వివరించారు.

### కంట్రోల్ రూమ్ లు....

1. కలెక్టరేట్ కంట్రోల్ రూమ్- 0891-2590100, 0891-2590102 , 2. జీవీఎంసీ సిటీ ఆపరేషన్ సెంటర్- 180042500009, వాట్సాప్ నెం.9014218870, 3. విశాఖపట్టణం ఆర్డీవో కార్యాలయం-0891-2562977, 4. భీమిలి ఆర్డీవో కార్యాలయం - 9014093139.

# కూటమి అభ్యర్థి ఎవరైనా గెలుపే లక్ష్యంగా సమష్టిగా పనిచేయాలి

**స్థానిక సంస్థల ఎన్నికలపై విస్తృత చర్చ.. కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలకు నేతల దిశానిర్దేశం**



**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** మండలంలో వంచుల పంచాయతీ పరిధిలోని చెరపల్లి గ్రామంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తల విస్తృత సమావేశం నిర్వహించారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని కూటమి పార్టీల మధ్య సమన్వయం, అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల కార్యాచరణ తదితర అంశాలపై సమావేశంలో సుదీర్ఘంగా చర్చించారు. కూటమి తరపున ఏ పార్టీకి, ఏ అభ్యర్థికి టికెట్ కేటాయించినప్పటికీ మిగిలిన కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు సమష్టిగా పనిచేసి అభ్యర్థి విజయానికి కృషి చేయాలని సమావేశంలో పిలుపునిచ్చారు. కూటమి పార్టీల మధ్య ఐక్యత, పరస్పర సహకారం, సమన్వయంతో ముందుకు సాగితే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులకు మద్దతు మరింత బలోపేతం అవుతుందని నాయకులు పేర్కొన్నారు. గ్రామస్థాయిలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేస్తూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లో కూటమి శ్రేణులను సమన్వయం చేయడం, పార్టీ కార్యకర్తలను ఎన్నికలకు సన్నద్ధం చేయడం, ప్రజలతో మరింతగా మమేకం కావడం వంటి అంశాలపై నాయకులు కార్యకర్తలకు పలు సూచనలు చేశారు. కూటమి పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పరస్పరం సహకరించుకుంటూ ఎన్నికల ప్రక్రియలో సమష్టిగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు. ఈ సమావేశానికి తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు పొత్తూరు కొండలరావు, ప్రధాన కార్యదర్శి పసుపులేటి నాగమణి, జనసేన మండల అధ్యక్షుడు కొయ్యం బాలరాజు, అరకు పార్లమెంట్ సభ్యుడు గొర్లె వీరవెంకట్, సహకార బ్యాంకు చైర్మన్ మొట్టడం సూకరాజు, ఎంపీటీసీ జోరంగి సరస్వతి, క్లస్టర్ ఇన్‌చార్జి వడేలా పాండురాజు, గంట నళిని, తెలుగు యువత అధ్యక్షుడు ముర్ల కోటేశ్వరరావు, ఆర్గనైజేషన్ సెక్రటరీ ఎంవీవీఎస్ ప్రసాద్‌తో పాటు వంచుల పంచాయతీకి చెందిన కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వాయుగుండం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తీర ప్రాంత ప్రజలు జాగ్రత్తగా ఉండాలి.. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు
- ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- పల్లా శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు మరియు గాజువాక ఎమ్మెల్యే



**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** వాయుగుండం ప్రభావంతో వాతావరణ పరిస్థితులు మారుతున్న నేపథ్యంలో గాజువాక నియోజకవర్గ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సూచించారు. ముఖ్యంగా తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు.

### మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దు

దిబ్బపాలెం, గంగవరం, శ్రీనగర్ మత్స్యకార కాలనీ, యారాడ తీర ప్రాంతం, పెదగంట్యాడ జాలారిపేట తదితర ప్రాంతాల్లో మత్స్యకారులు అప్రమత్తంగా ఉండాలని పల్లా సూచించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలించే వరకు చేపల వేటకు సముద్రంలోకి వెళ్లవద్దని హితవు పలికారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారుల భద్రతపై సంబంధిత అధికారులు దృష్టి సారించాలని పేర్కొన్నారు.

### ప్రాణ, ఆస్తి నష్టం లేకుండా చర్యలు

తీర ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితులను ముందుగానే అంచనా వేసి అవసరమైన సహాయక చర్యలకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని పల్లా అన్నారు. విద్యుత్, రహదారులు, తాగునీరు తదితర సేవలకు అంతరాయం కలగకుండా సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడమే ప్రధాన లక్ష్యంగా అధికారులు పనిచేయాలని పల్లా స్పష్టం చేశారు. ప్రజలు అత్యవసర పరిస్థితుల్లో అధికారులకు సమాచారం అందించి సహకరించాలని, అనవసరంగా బయటకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని పల్లా విజ్ఞప్తి చేశారు.

# జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు

**శ్రీకాకుళం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** శ్రీకాకుళం జిల్లా కేంద్రంగా పోలీసు కార్యాలయంలో డయల్-112, 6309990933 కంట్రోల్ రూమ్‌లతో పాటు, జిల్లాలోని మూడు పోలీసు సబ్ డివిజన్ల పరిధిలో ఆయా కార్యాలయాల్లో ప్రత్యేక కంట్రోల్ రూమ్‌లు, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి మంగళవారం ఒక ప్రకటన రూపంలో తెలిపారు.శ్రీకాకుళం డీఎస్పీ 6309990804, కాశీబుగ్గ డీఎస్పీ 6309990805, టెక్కలి డీఎస్పీ 6309990811, స్పెషల్ బ్రాంచ్ కంట్రోల్ రూమ్ 6309990911 నంబర్లను అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తో పోలీసు అధికారులు, సిబ్బందినిరంతరం సమన్వయం చేసుకుంటూ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.జిల్లాలోని ప్రజలు అత్యవసర పరిస్థితులు, సహాయం అవసరమైన సందర్భాల్లో డయల్-112 లేదా పై కంట్రోల్ రూమ్ నంబర్లను సంప్రదించాలని జిల్లా ఎస్పీ కోరారు. ప్రజల భద్రతకు పోలీసు యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు.

# వాయుగుండం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
**- జిల్లా ఉన్నతాధికారులతో ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు**



**శ్రీకాకుళం / కోటబొమ్మాళి , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లాలో విస్తారంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు సూచించారు. వాతావరణ పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని కోరారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో అనవసర ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ మహేశ్వర్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి తుఫాన్ ప్రభావం పై సమీక్షిస్తున్నారు. వాయుగుండం ప్రభావంపై జిల్లా ఉన్నతాధికారులతో మంత్రి ఎప్పటికప్పుడు ఫోన్లో మాట్లాడి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రజలకు తక్షణ సహాయం అందేలా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు.

**నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి**

ఎగువ ప్రాంతాలతో పాటు జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా వంశధార, నాగావళి, బాహుదా, మహేంద్రతనయ నదుల్లో వరద ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున నదీ పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి సూచించారు. ప్రజలు, పశువుల కాపరులు నదులు, వాగులు, కాలువలు, చెరువుల వద్దకు వెళ్లకూడదని, వరద నీటిని దాటేందుకు ప్రయత్నించవద్దని కోరారు.

**మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లవద్దు**

సముద్రం అల్లకల్లోలంగా ఉండే అవకాశం ఉన్నందున మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మంత్రి స్పష్టం చేశారు. ఇప్పటికే సముద్రంలో ఉన్న మత్స్యకారులు ఉంటే తమ పరిస్థితిని వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేసి, అధికారుల సూచనల మేరకు సురక్షిత ప్రాంతాలకు చేరుకోవాలని కోరారు. ప్రతికూల వాతావరణ పరిస్థితుల్లో సముద్రంలోకి వెళ్లి ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టుకోవద్దని సూచించారు.

**ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలి**

తీరప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల్లో పరిస్థితిని అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారని మంత్రి తెలిపారు. ముంపు ముప్పు ఉన్న ప్రాంతాల ప్రజలు అధికారులు ఇచ్చే సూచనలను తప్పనిసరిగా పాటిస్తూ ముందస్తుగా సురక్షిత ప్రాంతాలకు, పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు. ఎలాంటి పరిస్థితుల్లోనూ అధికారుల హెచ్చరికలను నిర్లక్ష్యం చేయవద్దని కోరారు.

**అత్యవసర పరిస్థితుల్లో కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలి**

వర్షాలు, వరదలు, రహదారుల పరిస్థితి, ఇతర అత్యవసర పరిస్థితులకు సంబంధించి సమాచారం లేదా సహాయం అవసరమైన ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్‌ను సంప్రదించాలని మంత్రి సూచించారు. జిల్లా కంట్రోల్ రూమ్: 08942-240557

**అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ ముందస్తు చర్యలు చేపట్టాలి**

వర్షాలు, వరదల కారణంగా అంటువ్యాధులు ప్రబలకుండా వైద్యశాఖ అధికారులు ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ప్రజలకు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించడంతో పాటు అవసరమైన మందులు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల భద్రతే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. వాయుగుండం ప్రభావం పూర్తిగా తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉంటూ జిల్లా అధికార యంత్రాంగానికి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# మహిళా అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్దపీట

**మహిళా రైతులు, పారిశ్రామికవేత్తలకు మాధవ్ అభినందనలు**



**విశాఖపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** విశాఖపట్నం, గాదెరాజ్ ప్యాలెస్‌లో భారతీయ కిసాన్ మోర్చా, ఆంధ్రప్రదేశ్ మరియు గ్రామీణ ప్రాంత రైతుల సహకార సంఘం (ఎంపీసీఎస్) ఆధ్వర్యంలో మహిళా సాధికారత, వ్యవసాయాభివృద్ధి, స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం అందించాలనే లక్ష్యంతో "మన వ్యవసాయం – మన ఆహారం – మన ఆరోగ్యం" అనే సందేశంతో రాష్ట్రస్థాయి మహిళా రైతులు, మహిళా పారిశ్రామికవేత్తల సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు పీవీయన్ మాధవ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా రైతులు, మహిళా పారిశ్రామికవేత్తలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను ఆయన సందర్శించి, వారి ఉత్పత్తులను పరిశీలించారు. మహిళలు స్వయంగా తయారు చేస్తున్న ఉత్పత్తులు, సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, స్థానిక ఉత్పత్తుల గురించి ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీవీయన్ మాధవ్ మాట్లాడుతూ, మహిళలు వ్యవసాయ రంగంతో పాటు పారిశ్రామిక, వ్యాపార రంగాల్లో కూడా మరింతగా ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. సేంద్రియ వ్యవసాయం, స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడం ద్వారా గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయవచ్చని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం మహిళా పారిశ్రామికవేత్తలు, స్వయం ఉపాధి రంగాల్లో పనిచేస్తున్న వారికి అందిస్తున్న వివిధ ప్రోత్సాహకాలు, సహాయ సహకారాలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. మహిళలు ఆర్థికంగా స్వావలంబన సాధించే దిశగా అవకాశాలను అందిపుచ్చుకుని, పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని పిలుపునిచ్చారు. మహిళా సాధికారతతో కుటుంబాలు, గ్రామీణ ప్రాంతాలు, సమాజం ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందుతాయని ఆయన అన్నారు. వ్యవసాయ ఉత్పత్తుల విలువను పెంచే కార్యక్రమాలు, స్థానిక ఉత్పత్తుల మార్కెటింగ్‌కు అవసరమైన ప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా అధ్యక్షులు కుమారస్వామి, పద్మశ్రీ వెంకటేశ్వరావు,అశోక్ కుమార్, పరశురాం రాజు, ఆదిలక్ష్మి ,లక్ష్మీసుజాత,జ్యోతి , విరజశ్రీ,ఐశ్వర్య,డా. కృష్ణ, సాయిబాబు,మురళీ,శ్రీనివాస్ మూర్తి,రామకృష్ణ ,చంద్రరావు, వెంకటేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ స్వామివారిని దర్శించుకున్న ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



**సింహాచలం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ దంపతులు మంగళవారం సింహాచలం శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన చైర్‌పర్సన్ రాయపాటి శైలజ, దంపతులకు ఆలయ పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె. ప్రసాద్ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం వేద పండితులు వేద మంత్రాలతో ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయ పర్యవేక్షణ అధికారి జి.వి.ఎస్.కె. ప్రసాద్ స్వామివారి ప్రసాదాలను చైర్‌పర్సన్ రాయపాటి శైలజ దంపతులకు ప్రసాదాలను అందజేశారు.

## స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు దంపతులు



**సింహాచలం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** సింహాచలం శ్రీశ్రీశ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారిని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీ దంపతులకు దేవస్థానం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఆధ్వర్యంలో ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్సీ దంపతులు అంతరాలయంలో స్వామివారిని దర్శించు కున్నారు . స్వామివారి దర్శనానంతరం కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకటరావు ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు దంపతులను శేషవస్త్రాలతో సత్కరించి,స్వామివారి ప్రసాదాలను అందజేశారు. అలాగే స్వామివారి జ్ఞాపికగా స్వామివారి చిత్రపటాన్ని బహుకరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం సహాయ కార్య నిర్వహణ అధికారి పిల్ల శ్రీనివాసరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో రాజీపడొద్దు : అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్

**- విధుల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 57 మంది పోలీసు సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందజేత**
**- నెలవారీ నేర సమీక్షా సమావేశంలో అధికారులకు కీలక దిశానిర్దేశం**



**అనకాపల్లి , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ అధ్యక్షతన జిల్లా స్థాయి నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లాలోని అందరు డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు హాజరయ్యారు. సమావేశం సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, ప్రజల భద్రత విషయంలో ప్రతి ఒక్క అధికారి బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎస్పీ జారీ చేసిన ముఖ్య ఆదేశాలు: రోడ్డు భద్రత ఢ డ్రంక్ అండ్ డ్రైవ్: జాతీయ రహదారులు, ప్రధాన కూడళ్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల శాతం పెంచాలని, హెల్మెట్ నిబంధనలను కఠినంగా అమలు చేయాలని ఆదేశించారు. గుర్తించిన బ్లాక్ స్పాట్స్ మరియు ప్రమాద ప్రదేశాలపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. ఆస్తి సంబంధిత నేరాలు ఢ రాత్రి గస్తీ: బైక్ చోరీలు, చైన్ స్నాచింగ్స్, తాళం వేసిన ఇళ్లలో దొంగతనాల నియంత్రణకు రాత్రిపూట గస్తీ మరియు బీట్ పెట్రోలింగ్‌ను పటిష్టం చేయాలని ఆదేశించారు. నేరం జరిగిన వెంటనే త్వరితగతిన కేసులను ఛేదించి, నిందితులను అరెస్ట్ చేసి రికవరీ సాధించేలా చూడాలన్నారు. పాత నేరస్థులపై నిరంతరం నిఘా ఉంచాలని, ఎల్.హెచ్.ఎం.ఎస్ విధానంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. మహిళా భద్రత: మహిళలు, చిన్నారుల రక్షణకు అత్యధిక ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహించడంతో పాటు శక్తి టీమ్స్ తో ప్రత్యేక నిఘాని ఏర్పాటు చేసి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. ఎన్నికల సన్నద్ధత ఢ రౌడీ షీటర్లపై నిఘా: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సమస్యాత్మక గ్రామాలను ముందస్తుగా సందర్శించి శాంతిభద్రతలను పర్యవేక్షించాలని సూచించారు. రౌడీ షీటర్లు, సంఘ విద్రోహ శక్తులపై బైండోవర్ చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న నాన్-బెయిలబుల్ వారెంట్లను శీఘ్రగతిన అమలు చేయాలని ఆదేశించారు. తుపాను ముందస్తు చర్యలు: తుపాను హెచ్చరికల నేపథ్యంలో లోతట్టు ప్రాంతాలు, కాజ్‌వేల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని, విపత్తు నిర్వహణ విభాగం మరియు రెవెన్యూ శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసా పత్రాలు: విధులలో విశేష ప్రతిభ కనబరిచిన 57 మంది పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ శ్రీ తుహిన్ సిన్హా ఐపీఎస్ ప్రశంసాపత్రాలు అందజేసి అభినందించారు. అచ్యుతాపురం సీఐ చంద్రశేఖర్‌కి "బెస్ట్ పెర్ఫార్మర్ ఆఫ్ ది మంత్", కసింకోట సీఐ స్వామినాయుడుకి "బెస్ట్ క్రైమ్ డిటెక్షన్" అవార్డులను అందజేశారు. ఈ సమీక్షా సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ ఇ.శ్రీనివాసులు, నర్సీపట్నం డీఎస్పీ పి.శ్రీనివాస రావు, పరవాడ డీఎస్పీ బి.మోహన రావు, ఏ.ఆర్ డీఎస్పీ కె.రవి కుమార్, సీఐలు బాల సూర్యారావు, లక్ష్మి, శ్రీనివాసరావు, సతీష్, రామకృష్ణ రావు, రమేష్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు.



# విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో 5వ మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించిన ప్రభుత్వ విప్, శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు)



**విశాఖ , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ (APSSDC – స్కిల్ డెవలప్‌మెంట్, ఉపాధి & శిక్షణ శాఖ) ఆధ్వర్యంలో విశాఖ పశ్చిమ నియోజకవర్గంలో నిర్వహించనున్న 5వ మెగా జాబ్ మేళా పోస్టర్‌ను ప్రభుత్వ విప్, విశాఖపట్నం పశ్చిమ శాసనసభ్యులు పి.జి.వి.ఆర్. నాయుడు (గణబాబు) ఘనంగా ఆవిష్కరించారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు కార్పొరేట్ రంగంలో ఉపాధి కల్పించడమే ధ్యేయంగా ఈ జాబ్ మేళాను ఏర్పాటు చేస్తున్నారు. నిరుద్యోగులు, అర్హత కలిగిన యువతీయువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

**జాబ్ మేళా పూర్తి వివరాలు:**

తేదీ: 28 సెప్టెంబర్ 2026 , సమయం: ఉదయం 9:00 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు , వేదిక: ఉమియా భవన్ కళ్యాణ మండపం, సుబ్రమణ్యస్వామి ఆలయం ఎదురుగా, ఎస్‌బీఐ ఢ ఎ2 పక్కన, ఎన్ఏడీ కొత్త రోడ్డు, విశాఖపట్నం , పాల్గొనే సంస్థలు: 15కు పైగా ప్రముఖ కంపెనీలు , మొత్తం ఖాళీలు: 1000కి పైగా ఉద్యోగావకాశాలు , రిజిస్ట్రేషన్ ఢ సంప్రదింపుల వివరాలు: , అభ్యర్థులు అధికారిక వెబ్‌సైట్ www.naipunyam.ap.gov.in ద్వారా లేదా పోస్టర్‌లో పేర్కొన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి తమ పేర్లను నవోదు చేసుకోవచ్చు. హెల్ప్‌లైన్ నంబర్లు: 9988853335, 8712655688, 8790118349, 8790117279, 8555868681,8019589895 అభ్యర్థులు తమ విద్యార్హత పత్రాల జిరాక్స్ ప్రతులు, రెజ్యూమ్ (బయోడేటా), ఆధార్ కార్డు కాపీలతో నిర్ణీత సమయానికి ఇంటర్వ్యూలకు హాజరై ఈ అవకాశాన్ని సద్వినియోగపరచుకోవాల్సిందిగా తెలిపారు.

# వృద్ధులు, దివ్యాంగుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనానికి రూ.7 లక్షల విరాళం



**సింహాచలం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** శ్రీ శ్రీ శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో స్వామివారి దర్శనానికి విచ్చేసే వృద్ధులు, దివ్యాంగ భక్తుల సౌకర్యార్థం బ్యాటరీ వాహనం కొనుగోలుకు హైదరాబాద్‌కు చెందిన నడింపల్లి వెంకట రామకృష్ణ రాజు రూ.7 లక్షల విరాళాన్ని అందించారు. ఈ మేరకు రూ.7 లక్షల విలువైన చెక్కును మంగళవారం ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావుకు అందజేశారు. భక్తుల సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని విరాళం అందించిన నడింపల్లి వెంకట రామకృష్ణ రాజును ఆలయ కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు అభినందించారు. భక్తుల సేవలో భాగంగా అందించిన ఈ సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు.

# నేపాల్ లో బాధితులకు హెల్ప్ ఎయిడ్ ద్వారా కేథరిన్ చేయూత



**భీమునిపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ):** ఇటీవల నేపాల్ లో సంభవించిన పెను ప్రకృతి ప్రమాదం విధితమే. తద్వారా నిరాశ్రయులైన వారికి తమ వంతు సహాయం చేయుటకు కేథరిన్ విద్యాసంస్థలు ముందుకు వచ్చాయి. కేథరిన్ విద్యాసంస్థల విద్యార్థులు, ఉపాధ్యాయ బృందం మరియు హెల్పర్ స్టాఫ్ కలిపి 1,40,000 విరాళం సేకరించగా కేథరిన్ విద్యాసంస్థల యాజమాన్యం దానికి మరో లక్షా అరవై వేలు జోడించి హెల్ప్ ఎయిడ్ కు అందించారు. కేథరిన్ విద్యాసంస్థల అధినేత ఆలివర్ రాయి నేతృత్వంలో బయలుదేరనున్న హెల్ప్ ఎయిడ్ బృందం వారు, ఇచ్చిన ఈ విరాళాన్ని నేపాల్ ప్రభుత్వం వారు వారి వెబ్సైట్లో విడుదల చేసిన అవసరత లిస్టులో ఉన్న సూపర్ కంప్యూటర్ కొరకు వినియోగించనున్నారు. ఈ విరాళం ద్వారా కొనుగోలు చేసి అందించనున్న సూపర్ కంప్యూటర్ భారీ వర్షాలు, వరదలు వంటివి ముందస్తు హెచ్చరికలు జారీ చేస్తూ పెను ప్రమాదాలు నుండి ప్రజలను సురక్షితంగా తరలించుటకు ఉపయోగపడనున్నది.

సాటిలైట్ ఇమేజరీని విశ్లేషించి నేపాల్ ప్రభుత్వానికి హెచ్చరికలు జారీ చేయుటకు ఈ సూపర్ కంప్యూటర్ ని అందిస్తున్నామని తెలిపారు. చిన్ని చేతులతో పెద్ద మనసుతో ఇచ్చిన ప్రతి రూపాయిని కూడా అనేక వేల మంది ప్రాణాలను కాపాడడానికి కేథరిన్ విద్యార్థుల విరాళం పనిచేస్తుందని హెల్ప్ ఎయిడ్ ప్రతినిధి జాన్ సుధాకర్ తెలిపారు. 22వ తేదిన బయలుదేరిన బృందం అనేక ప్రాంతాలలో సందర్శించి అక్కడ అవసరతలను తెలుసుకొని సుమారుగా 20 లక్షల సహాయక చర్యలు చేపట్టనున్నారు. తిరిగి వీరు 27వ తారీఖున వచ్చి రెండో సహాయక చర్య పర్యటన 40 లక్షల మెడికల్ ఎక్విప్మెంట్ సామాగ్రిని త్వరలో తీసుకొని వెళ్ళనున్నారు.

# నియోజకవర్గాల్లో మౌలిక వసతుల కల్పనకే పెద్దపీట

## రెండేళ్లలో అభివృద్ధి పనుల కోసం రూ.532 కోట్లు కేటాయింపు - స్పీకర్ అయ్యన్న పాత్రుడు

**నర్సీపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం అధిక మొత్తంలో నిధులు కేటాయించడం జరుగుతుందని స్పీకర్ లి అయ్యన్న పాత్రుడులి పేర్కొన్నారు. మంగళవారం నర్సీపట్నంలో స్పీకర్ నేతృత్వంలో జరిగిన పట్టణాల ముఖచిత్రం మారేలా ప్రపంచ స్థాయి మౌలిక వసతుల అభివృద్ధి - రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్ శంకుస్థాపన మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రెండేళ్లలో రికార్డు స్థాయిలో నర్సీపట్నం నియోజకవర్గంలో మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ.532 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని పేర్కొన్నారు. స్థానిక నేతలు ఈ అభివృద్ధిని ప్రజలకు చూపించాలని కోరారు.



**వీఎంఆర్డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్ వెల్లడి:**

వీఎంఆర్డీఏ చైర్మన్ లి ఎం.వి. ప్రణవ్ గోపాల్లి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో వేగంగా ముందుకు దూసుకుపోతోందని, ఉత్తరాంధ్రను ఉత్తమాంధ్రగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పాలన సాగుతుందని పేర్కొన్నారు. వీఎంఆర్డీఏ పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామన్నారు. స్పీకర్ అయ్యన్న పాత్రుడు సూచనల మేరకు నర్సీపట్నం అభివృద్ధికి రూ.41.50 కోట్ల వీఎంఆర్డీఏ నిధులు కేటాయించామని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన రెండేళ్లలో వీఎంఆర్డీఏ



పరిధిలోని అన్ని నియోజకవర్గాల్లో అభివృద్ధి పనుల కోసం రూ.722 కోట్లు, అనకాపల్లి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల పరిధిలో రూ.120 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని స్పష్టం చేశారు. రోడ్లు, కాలువలు, కల్వర్టులు, తాగునీరు, వీధి దీపాలు, కన్వెన్షన్ సెంటర్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నామని, వీఎంఆర్డీఏను పట్టణాలకే పరిమితం చేయకుండా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కూడా చిరునామాగా మారుస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్, పట్టణ పురపాలక శాఖ మంత్రి నారాయణ సూచనలతో మున్సిపాలిటీల ముఖచిత్రం మారేలా నిధులు మంజూరు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు చింతకాయల విజయ్, అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు తాతయ్య బాబు, పార్టీ పరిశీలకులు స్వామి, జనసేన ఇంచార్జి సూర్య చంద్ర తదితరులు పాల్గొన్నారు.

# భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దు :జనసేన అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ వీర వెంకట్



**గూడెంకొత్తవీధి, , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** రాష్ట్రంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో పలుచోట్ల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జనసేన నాయకులు అరకు పార్లమెంట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గొర్లె వీర వెంకట్ విజ్ఞప్తి చేశారు. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉన్నందున అత్యవసర పరిస్థితి అయితే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావద్దని సూచించారు. ముఖ్యంగా భారీ వర్షాల సమయంలో చెట్లు, కొండచరియలు, మట్టి మిద్దెలు విరిగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు మరింత జాగ్రత్తగా వ్యవహరించాలని కోరారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, వర్షపు నీరు ఇళ్లలోకి చేరే పరిస్థితులు ఏర్పడితే ముందుగానే సురక్షిత ప్రాంతాలకు వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. వాగులు, వంకలు, కల్వర్టులు, కొండ ప్రాంతాల వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో అధికార యంత్రాంగానికి సమాచారం అందించాలని తెలిపారు. రహదారులపై నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రయాణాలు చేయకుండా పరిస్థితులు సాధారణమయ్యే వరకు వేచి ఉండాలని సూచించారు. విపత్తు ఎక్కడ సంభవించినా జనసేన అండగా ఉంటుంది అనే భరోసాను నాయకులు వ్యక్తం చేశారు. భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా ఇళ్లు దెబ్బతిన్నా, చెట్లు కూలిపోయినా, కొండచరియలు విరిగిపడినా లేదా ఇతర విపత్కర పరిస్థితులు ఏర్పడినా జనసైనికులు, జనసేన నాయకులు వెంటనే స్పందించి సహాయక చర్యల్లో పాల్గొనాలని పిలుపునిచ్చారు. బాధిత ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించడంతో పాటు అధికారులకు సమాచారం అందించి సహాయక చర్యలు వేగవంతమయ్యేలా కృషి చేయాలని కోరారు. ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, వర్షాల పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అనవసర ప్రయాణాలు పూర్తిగా నివారించాలని జనసేన నాయకులు సూచించారు. ముఖ్యంగా గిరిజన, కొండ ప్రాంతాల్లో నివసించే ప్రజలు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా ప్రమాద సూచన కనిపించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు. ఈ విపత్కర పరిస్థితుల్లో ప్రజలకు అండగా నిలిచి, అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జనసైనికులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# ఓజోన్ పొరను పరిరక్షించుకోవాలి



**భీమునిపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** ఓజోన్ పొర నాశనం అయితే అతినీలలోహిత కిరణాలు భూమిని తాకి జీవరాశుల ఉనికిని నష్టపరుస్తాయన్నారు. మాంట్రియల్ ఒప్పందాన్ని గౌరవిస్తూ భవిష్యతరాలకు ఆరోగ్యకర వాతావరణాన్ని అందించడానికి ప్రజలు, ప్రభుత్వాలు అవగాహనతో ముందుకు సాగాలని గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డైరక్టర్ ప్రొఫెసర్ చందు కవిత పిలుపునిచ్చారు. గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఓజోన్ పరిరక్షణ పై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శీతల యంత్రాల కారణంగా ఓజోన్ పొర దెబ్బతిని మానవ మనుగడ ప్రమాదంలో పడుతోందన్నారు. వీటికి ప్రత్యామ్నాయ పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గీతం జీవ శాస్త్ర విభాగం అధిపతి డాక్టర్ నీరజ్‌మిశ్ర, కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ కె.సూరేష్ కుమార్ తమ ప్రసంగాలలో ఓజోన్ పొరను దెబ్బతీసే కాలుష్య కారకాల నియంత్రణకు ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న కృషిని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ సరిత, డాక్టర్ ఆర్.కిరణ్మయి, డాక్టర్ హరీష్ ప్రకాష్, డాక్టర్ ఆదర్శ్ కుమార్, డాక్టర్ కె.మదన్‌శేఖర్ నిర్వహకులుగాను, పరిశోధకులు, విద్యార్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరంలోని వివిధ కళాశాలలకు చెందిన ఆఖరి సంవత్సరం యుజి, పిజి విద్యార్థులకు వ్యాసరూప పోటీలు, నాటికలు, క్విజ్ పోటీలు మరియు ట్రెజర్ హంట్ వంటి వివిధ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

# విజనరీ వెంటే విశాఖ : గంటా



**భీమునిపట్నం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** విజనరీ లీడర్, సీఎం చంద్రబాబు వెంటే విశాఖ ప్రజలు ఉంటారని భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ వి కన్వెన్షన్ లో రూ. 3,892 కోట్ల అభివృద్ధి పనులకు సీఎం చంద్రబాబు మంగళవారం వర్చువల్ గా శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ విశాఖను చంద్రబాబు మానస పుత్రికగా అభివర్ణించారు. ఇక్కడి ప్రజలు ఎప్పుడూ చంద్రబాబుకు అండగా ఉంటారని పేర్కొంటూ.. 2019 వైసీపీ గాలిలో సైతం విశాఖలో నాలుగు దిక్కులు ( ఈస్ట్.. వెస్ట్.. నార్త్.. సౌత్) చంద్రబాబుకే జై కొట్టాయని తెలిపారు. హుద్ హుద్ సమయంలో 10 రోజుల పాటు బస్సులో బస చేసి పరిస్థితిని చక్కదిద్దిన సీఎం పట్ల విశాఖ ప్రజలందరూ అభిమానంతో ఉంటారని చెప్పారు. స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష ఫలితాలు సాధించి రాజకీయంగా జగన్మోహన్ రెడ్డి విశాఖ మర్చిపోయేలా చేయాలన్నారు. దేశంలో మూడొంతుల పెట్టుబడులు ఆంధ్రప్రదేశ్ కు.. రాష్ట్రానికి వచ్చే పెట్టుబడుల్లో మూడో వంతు విశాఖకు వస్తున్నాయని పేర్కొన్నారు. భీమిలి, పెందుర్తిలలోనే అభివృద్ధికి ఎక్కువ అవకాశాలున్నాయన్నారు. ఒకే రోజు విశాఖలో 25 ఐటీ కంపెనీలకు మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారని, 16 ఫైవ్ స్టార్ హోటల్స్ వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని వివరించారు. భోగాపురం ఎయిర్ పోర్టు - విశాఖ మధ్య ఉన్న భీమిలి, మధురవాడ ప్రాంతం హైదరాబాద్ గచ్చిబౌలి, మాదాపూర్ స్థాయిలో శరవేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. మధురవాడలో రూ. 725 కోట్ల నిరంతర తాగు నీరు.. రూ. 658 కోట్ల అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ప్రాజెక్టులు రెండేళ్లలో అందుబాటులోకి వస్తాయని వెల్లడించారు.

# అతి భారీ వర్షాల హెచ్చరిక..అధికారులు అప్రమత్తం

## గ్రామాల్లో ముందస్తు చర్యలు ముమ్మరం.. ప్రమాదకర ప్రాంతాలపై ప్రత్యేక నిఘా




**గూడెంకొత్తవీధి , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** రానున్న రెండు రోజుల పాటు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో గూడెంకొత్తవీధి మండల యంత్రాంగం అప్రమత్తమైంది. ఈ మేరకు గ్రామ రెవెన్యూ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, ప్రతి ఒక్కరూ తమ తమ పంచాయతీ ప్రధాన కార్యాలయాల్లో అందుబాటులో ఉండాలని అధికారులు ఆదేశించారు. వర్షాల కారణంగా ఎలాంటి అత్యవసర పరిస్థితి ఎదురైనా వెంటనే స్పందించే విధంగా ముందస్తు చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. మండల పరిధిలో భారీ వర్షాల కారణంగా ఎక్కడైనా ప్రమాదాలు సంభవించినా, ఇళ్లు కూలిపోయే పరిస్థితులు ఏర్పడినా, చెట్లు నేలకొరిగినా, వాగులు పొంగి రాకపోకలకు అంతరాయం ఏర్పడినా లేదా ఇతర అత్యవసర పరిస్థితులు తలెత్తినా విషయాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని గ్రామ రెవెన్యూ అధికారులకు సూచించారు. సమాచారం అందిన వెంటనే సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణ సహాయక చర్యలు చేపట్టేలా అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ముఖ్యంగా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న చట్రపల్లి, తోకరాయి గ్రామాల గ్రామ రెవెన్యూ అధికారులను ప్రత్యేకంగా అప్రమత్తం చేశారు. ఆయా గ్రామాల్లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని, ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకు ముందస్తు జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఇందులో భాగంగా సంబంధిత గ్రామ రెవెన్యూ అధికారులు మంగళవారం సాయంత్రం ఆయా గ్రామాలను సందర్శించి గ్రామ ప్రజలకు భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ముందస్తు అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితులు ఏర్పడిన సందర్భంలో ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు అవసరమైన చర్యలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని అధికారులు తెలిపారు. ముఖ్యంగా కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రమాదకర ప్రాంతాలకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని సూచించారు. పరిస్థితులు తీవ్రతరమైతే ప్రజలను వెంటనే సమీపంలోని సురక్షిత పునరావాస కేంద్రాలకు తరలించే విధంగా చర్యలు చేపడతామని గ్రామ ప్రజలకు అధికారులు భరోసా ఇచ్చారు. మండల ప్రజలందరూ రానున్న రెండు మూడు రోజుల పాటు వాతావరణ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. అత్యవసర పరిస్థితి ఏర్పడినా, ఏదైనా సహాయం అవసరమైనా ఆలస్యం చేయకుండా సంబంధిత అధికారులను లేదా మండల కార్యాలయాన్ని వెంటనే సంప్రదించాలని కోరారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షిస్తున్నారని తెలిపారు.

## డ్రంకన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన లారీ డ్రైవరుకు 7రోజులు జైలు శిక్ష



విజయనగరం జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్

**విజయనగరం , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** గడిచిన సంవత్సర కాలంలో మద్యం సేవించి వాహనాలు నడిపిన సుమారు 150 మందిని జైలుకు పంపించామన్న జిల్లా ఎస్పీ ఎ.ఆర్.దామోదర్,ఐపిఎస్ విజయనగరం పట్టణం ఓవర్ బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ పోలీసులకు మద్యం సేవించి లారీ నడిపి పట్టుబడిన విజయనగరం పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన వ్యక్తి జమ్ము అప్పల నాయుడుకు స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, విజయనగరం కే.రామకృష్ణ 7 రోజుల జైలు శిక్ష విధించి నట్లుగా జిల్లా ఎస్పీ ఎ.ఆర్ .దామో దర్,ఐపిఎస్ సెప్టెంబర్ 22న తెలిపారు. వివరాల్లోకి వెళ్తే... స్థానిక ఎత్తు బ్రిడ్జి వద్ద ట్రాఫిక్ పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టగా విజయనగరం పట్టణం సంజీవనగర్ కాలనీకి చెందిన వ్యక్తి జమ్ము అప్పలనాయుడు మద్యం సేవించి లారీ నడుపుతూ పోలీసులకు పట్టుబడ్డాడన్నారు. పోలీసులు డ్రంకన్ డ్రైవ్ తనిఖీలు చేయగా, సదరు లారీ డ్రైవర్ మద్యం సేవించి ఉన్నట్లుగా నిర్ధారణ కావడంతో కేసు నమోదు చేసారన్నారు. ట్రాఫిక్ పోలీసులు సెప్టెంబర్ 22న స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్, విజయనగరం వారి వద్ద హాజరుపరచగా నిందితులకు 7 రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపిఎస్ తెలిపారు. మద్యం సేవించి వాహనాలను నడిపి ప్రమాదాలకు కారణమవుతున్నం దున ఈ తరహా నేరాన్ని తీవ్రంగా పరిగణించి, నిందితులకు జైలుశిక్ష విధించే విధంగా చర్యలు చేపడుతున్నామని జిల్లా ఎస్పీ తెలిపారు.

# భారీ వర్షాల నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలి..24/7 పర్యవేక్షణ, సహాయక చర్యలు చేపట్టాలి : జిల్లా కలెక్టర్

## జిల్లాలో రెడ్ అలర్ట్ - అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలి

**పాడేరు , సెప్టెంబర్ 22 ( మనం న్యూస్ ) :** జిల్లాకు రెడ్ అలర్ట్ జారీ కావడంతో పాటు భారీ వర్షాలు, వరదలు, కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ టి. నిశాంతి, IAS అన్ని శాఖల అధికారులు, మండల స్థాయి అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది పూర్తిస్థాయిలో అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు నిరంతర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాల్లో, ముఖ్యంగా వాగులు, వంకలు, కాలువలు, ఇతర నీటి వనరుల వద్ద నీటిమట్టం పెరిగే అవకాశం ఉన్న ప్రాంతాల్లో 24 గంటల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పోలీసు సిబ్బంది, గ్రామ/వార్డు సచివాలయ సిబ్బంది, VRA/VROలు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బందిని నిరంతర పర్యవేక్షణకు వినియోగించాలని సూచించారు. తహసీల్దార్లు అవసరమైన మండల స్థాయి ఆదేశాలు జారీ చేసి పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు.

### కంట్రోల్ రూమ్‌లను 24 గంటలు పనిచేసేలా చూడాలి

కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్‌ను వెంటనే యాక్టివేట్ చేసి, మండల, డివిజన్ స్థాయిల్లోని కంట్రోల్ రూమ్‌లు కూడా 24 గంటలు పనిచేసేలా చూడాలని కలెక్టర్ DROను ఆదేశించారు. అన్ని శాఖలు ప్రతిరోజూ నష్టం వివరాలను సమర్పించాలని సూచించారు. రహదారులు, విద్యుత్ సరఫరా, పంటలు, పశు సంపద, ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్తులకు జరిగిన నష్టాల వివరాలను సేకరించి సమగ్ర నష్టం నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్డు కోతలు, దెబ్బతిన్న కల్వర్టులు, కొండచరియలు విరిగిపడటం లేదా ఇతర అత్యవసర పరిస్థితులు ఏర్పడిన వెంటనే క్షేత్రస్థాయి అధికారులు ఆలస్యం లేకుండా జిల్లా యంత్రాంగానికి నేరుగా సమాచారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు.

### ప్రమాదకర, సున్నిత ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలి

ప్రధాన రహదారులు, కల్వర్టులు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాలు, జలపాతాలు, వాగులు, వంకల పరిసర ప్రాంతాలు తదితర ప్రమాదకర, సున్నిత ప్రాంతాలను గుర్తించి నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. R&B, APEPDCL, పంచాయతీరాజ్ శాఖల పరిధిలోని సున్నిత ప్రాంతాలు, అందుబాటులో ఉన్న యంత్రాలు, సిబ్బంది వివరాలను సేకరించి సమన్వయంతో అత్యవసర చర్యలకు సిద్ధంగా ఉండాలని సూచించారు. గతంలో పాడేరు, జి.కె.వీధి, అనంతగిరి ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడిన ఘటనలను దృష్టిలో ఉంచుకుని, ప్రమాదకర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలను ముందుగానే అప్రమత్తం చేయాలని, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

### మూడు షిఫ్టుల్లో 24/7 విధులు

తహసీల్దార్లు, MPDOలు తమ మండల పరిధిలోని అన్ని శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని మూడు షిఫ్టుల్లో 24 గంటల పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. రెడ్ అలర్ట్, ప్రస్తుత అత్యవసర పరిస్థితుల నేపథ్యంలో అత్యవసర విధులకు తగినంత సిబ్బంది అందుబాటులో ఉండేలా శాఖాధిపతులు చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయి నుంచి వచ్చే సమాచారంపై స్పందించడంలో ఎలాంటి జాప్యం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.

### రహదారులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు తక్షణ చర్యలు

చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు పడిపోవడం వంటి కారణాలతో రహదారి రాకపోకలు, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే వెంటనే పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని =ఐఔ,"గ్రాజూణజూ అధికారులను ఆదేశించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు జేసీబీలు, పవర్ సా యంత్రాలు, క్రేన్లు, ఇతర అవసరమైన పరికరాలు, సిబ్బంది, విద్యుత్ సామగ్రిని సిద్ధంగా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

### ప్రాణ, పశుసంపద నష్ట నివారణకు ప్రాధాన్యత

ప్రజలు ప్రమాదకరమైన కొండ ప్రాంతాలు, జలపాతాలు, వాగులు, వంకలు, ఇతర సున్నిత ప్రాంతాల్లోకి వెళ్లకుండా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. VRO\T, పంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, ఇతర క్షేత్రస్థాయి సిబ్బంది ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక అప్రమత్తతతో ఉండాలని సూచించారు. అవసరమైన చోట్ల ప్రజలను ముందుగానే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలించాలని, పశుసంపదకు నష్టం వాటిల్లకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైనప్పుడు వాటిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.అత్యవసర పరిస్థితుల్లో స్పందించేందుకు ాణ=ఖీ, చీణ=ఖీ బృందాల లభ్యత, సమన్వయానికి సంబంధించిన తాజా సమాచారాన్ని అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో ప్రతి అధికారి, క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయి నుంచి అందే సమాచారంపై తక్షణమే స్పందించి సహాయక, పునరుద్ధరణ చర్యలను సమన్వయం చేయాలని, పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకు పర్యవేక్షణ కొనసాగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

### ప్రజలకు విజ్ఞప్తి

జిల్లాకు రెడ్ అలర్ట్ నేపథ్యంలో ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా యంత్రాంగం విజ్ఞప్తి చేసింది. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, కాలువలు, కల్వర్టులు, కాజ్‌వేలు, లోతట్టు రహదారులను దాటేందుకు ప్రయత్నించవద్దు. భారీ వర్షాల సమయంలో జలపాతాలు, కొండచరియలు విరిగిపడే ప్రాంతాలు, కొండ వాలులు, ఇతర ప్రమాదకర ప్రాంతాలను సందర్శించవద్దు. ప్రమాదకర ప్రాంతాల్లో నివసించే ప్రజలు స్థానిక అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించి, అవసరమైతే సురక్షిత ప్రాంతాలకు లేదా పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలి. కూలిపోయిన విద్యుత్ స్తంభాలు లేదా తెగిపోయిన విద్యుత్ తీగలను ఎట్టి పరిస్థితుల్లోనూ తాకవద్దు. రహదారి దిగ్బంధం, కొండచరియలు విరిగిపడటం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ స్తంభాలు దెబ్బతినడం లేదా ఇతర అత్యవసర పరిస్థితులపై వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలి. అధికారిక సమాచారం, సూచనలను మాత్రమే నమ్మాలి. ధృవీకరించని సమాచారాన్ని సోషల్ మీడియాలో ప్రచారం చేయవద్దు. "అప్రమత్తంగా ఉండండి సురక్షితంగా ఉండండి – రెడ్ అలర్ట్ సమయంలో అధికారిక సూచనలను తప్పనిసరిగా పాటించండి."